# ఓ మహిషాత్మ కథ

(1986)

లోకమంతా చిక్కని చీకటితో నిండి వుంది- చుట్టూ బురద. రొచ్చు. దుర్గంధం- కంటిమీదికి కునుకు రావటంలేదు-

ఒళ్ళంతా నొప్పులు- కడుపంతా పచ్చిపుండయిపోయింది. వీపు మీద తేరిన తట్లలోంచి రక్తం చిమ్మి, మంటపుడుతోంది.

రాత్రులు దోమలూ. పగలు ఈగలూ ఆ గాయాలమీద వాలి మరింత బాధను కలిగిస్తున్నాయి.

రెండు రోజులుగా ఒంట్లో అస్వస్థతగా వుంది! అయినా రోజూ చేసే పనికి రెట్టింపుపని చెయ్యాల్సి వస్తోంది— తన బాధను ఎవరితో చెప్పుకోగలదు? ఎలా చెప్పుకోగలదు?

తనకి నోరుంది- అది తిండి తినడానికీ, నీళ్ళు త్రాగడానికేగాని అభిప్రాయాన్ని వ్యక్తం చేయడానికి పనికిరాదు.

ఎప్పుడో....చిన్నప్పుడు....అంబా అంటూ తల్లిచుట్టూ తిరిగేది! పొదుగు పాలు తాగేది! పొదుగునుండి దూరం చేసినవారే కన్నతల్లి నుండీ దూరం చేసేరు....దుర్మార్గంగా....దౌర్జన్యంగా!

వాళ్ళకెవరిచ్చారీ హక్కు- నోరు లేని జీవాలను తల్లినుండి దూరంచేసి తమ స్వప్రయోజనాల కోసం బానిసలుగా వినియోగించుకోమని?

పోనీ, కష్టానికి తగ్గ తిండిపెట్టి తగినంత విశ్రాంతి నిస్తారా అంటే....అదీ లేదు!

ఎంత రాక్షసు లీ మనుషులు!

నోరూవాపీ లేకపోవడం వల్లనూ, ప్రతిఘటించి ఎదురుతిరిగే స్వభావం లేకపోవడం వల్లనే యీ బానిస బ్రతుకు బతకాల్సి వస్తోంది.

చిన్నతనంలో పల్లెవాతావరణంలో పెరిగిందేమో ఎంత హాయిగా ....స్వేచ్ఛగా వుండేది!

ప్రకృతంతా తనదేనన్నట్లు పగలంతా పచ్చని పచ్చికబయళ్ళలోనూ కొండ చరియల్లోనూ తిరిగి హాయిగా కావల్సింది తిని, సెలయేటి నీళ్ళు తాగి, ఆటలాడి చీకటయ్యేసరికి తల్లి పంచన చేరేది. తనొక్క క్షణం కన్పించకపోతే తల్లి కళ్ళలో ఎంత దిగులు ఆతృత కనబడేది!

తమ కళ్ళు చూడటానికీ, కన్నీళ్ళు కార్చడానికే అనుకునే వారికేం తెలుస్తుంది తాము కళ్ళతో కూడ మాట్లాడుకుని బాసలు చేసుకోగలమని!

ఆరోజు తనకు బాగా గుర్తు.

ఆ రాత్రీ యిలాగే చిమ్మచీకటి. తల్లి దగ్గరికి పోవాలని ఎంత ఆరాటపడిందో. కానీ కుదరలేదు- బలమైన తాడుతో తనని గుంజకి కట్టేశారు. ఎందుకో....చాల దిగులనిపించింది.

ఆ మర్నాడుదయం తనకు కడుపు నిండా తిండి పెట్టి వంటి నిండా స్నానం చేయించాడు యజమాని. అప్పుడే ఓమారు తల్లి దగ్గరకు పరుగెత్తింది- ఆప్యాయంగా వళ్ళంతా నిమిరింది తల్లి-

అంతే! అదే ఆఖరు తను తల్లిని చూడటం. ఆరోజే తను సంతలోని పశువై వేరొకరికి అమ్ముడుపోయింది-

డబ్బు సంపాదించడం కోసమే తన యజమాని తనను అమ్మేశాడట- డబ్బుకోసం తల్లీ బిడ్డల్ని వేరుచేయడం ఎంత నీచం! సృష్టి మొత్తంమీద ప్రాణుల్లో డబ్బును గూర్చి తాపత్రయపడేది యీ మనుషులే కాబోలు!

ఇప్పటికి ముగ్గురు యజమానులు మారారు- శరీరంలోని కండలన్నీ కరిగిపోయి ఎముకల గూడే మిగిలింది- బరువులు లాగుతూ యే నడిరోడ్డు మీదనో తనువులు చాలించే సమయం ఆసన్నమైంది. కడుపుకు తిండిలేదు- కంటికి కునుకులేదు- శరీరానికి విశ్రాంతిలేదు-

ఎండకు ఎండుతూ, వానకూ, మంచుకూ తడుస్తూ ఇలా యీ పట్నవాసపు కుళ్ళలో పడి వుండాల్సిందే!

ఈ పరిస్థితిలో తనను కొనేవారెవరు?

ఎక్కడో ఓ వింతపక్షి ఆకాశంమీద అరుస్తూ పోతూంది-

అర్థరాత్రి దాటినట్లుంది- లోకమంతా నిద్రలో....విశ్రాంతిలో వుంది- తనకిమాత్రం ఆ అదృష్టం లేదు.

మొదట్లో....యిప్పటి తన యజమాని చాల పేదవాడు- చేతినిండా పని, కడుపునిండా తిండిలేని ఓ వ్యవసాయ కూలీ- పల్లెనుండి పట్నం వచ్చి కొన్నాళ్ళు మూటలు మోసేడు- తర్వాత గవర్నమెంటు వారిచ్చిన అప్పుతో ఓ బండినీ, తననూ కొన్నాడు- అప్పటితో అత నికి కష్టాలు తీరిపోయాయి.

వచ్చిన కష్టాలన్నీ తనకే-

తన బండిమీద రోజూ ఎన్ని సరుకులో తోల్తాడు. ఇళ్ళ కట్ట డాల కుపయోగించే ఇసుక, సిమ్మెంటు, తదితర సామగ్రీ తోల్తాడు-

ఎక్కువ డబ్బులే పుచ్చుకుంటాడు- ఒక్కొక్కప్పుడు రాత్రులు దొంగసరుకు కూడా రవాణా చేస్తుంటాడు. అలా పగలు సంపాదించిన సొమ్ముకంటె రాత్రులే ఎక్కువ సంపాదిస్తాడు-

అదృష్టవశాత్తూ యీ పరిసరాల్లో మరో బండీలేదు. పైగా కొత్తగా కడుతూన్న యిళ్ళు వుండటం వలన వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా నడుస్తోంది.

ఒక్కొక్కప్పుడు తన యజమానిని చూస్తుంటే ఎంత ఈర్ష్య కలుగు తుందో? అన్ని జన్మలకంటె ఉత్తమ జన్మ అయిన మానవజన్మ ఎత్తి అతను సుఖపడుతున్నందుకు కాదు- పూర్వజన్మ సుకృతాన్ని బట్టి జన్మలేర్పడతాయన్న నమ్మకం తనకూ వుంది. పూర్వజన్మలో తనూ యిప్పటి తన యజమానిలా ఏ నోరులేని ప్రాణుల్ని హింసించిందో!

ఈ జన్మలో యిలా లాఠీదెబ్బలుతింటూ బతికున్నంతకాలం బానిసై బతకాల్సి వస్తోంది. తన నమ్మకం ప్రకారం తన యజమానికూడ వచ్చే జన్మలో లాఠీ దెబ్బలుతింటూ బతుకంతా బానిసగా గడిపేస్తాడు. అది న్యాయం.

ఇంతకీ తను ఈర్ష్యపడేది అతని జన్మను గురించికాదు- అతని జీవన స్థితిగతుల గురించి- మొదట్లో బ్రతుకును దుర్భరంగా గడిపేవాడు యిప్పుడు తనను ఉపయోగించుకుని బ్రతుకును చక్కదిద్దుకున్నాడు-

ఆహారం, బట్ట, ఇల్లు....అన్నిటా మార్పు వచ్చింది. తను మాత్రం అప్పటిలానే వుంది. ఇంకా అంతకంటే హీనస్థితిలోకి వచ్చేసింది.

తనవల్ల అభివృద్ధిలోకి వచ్చిన యజమాని తనకోసం మాత్రం తగిన శ్రద్ధ తీసుకోవటం లేదు-

నిజానికి శ్రమకుతగ్గ తిండి, విశ్రాంతి తనకు లభించటంలేదు- అందుకే స్వచ్ఛమైన తన మనసులో ఈర్ష్యాద్వేషాల విషబీజాలు నాటుకుంటున్నాయి- అదే....రేపు పగ, ప్రతీకారాలుగ మారితే....? స్వేచ్ఛకోసం తెగువను, ధైర్యాన్ని ప్రదర్శించాలనుకుంటే....?నోరులేని జీవాలపై ఆధారపడి బ్రతికే యీ మనుషులంతా ఏమైపోతారో!

ఎందుకో....తన ఆలోచనలు తనకే కొత్తగా వుంటున్నాయీ మధ్య.

ఓరోజు తను యిసుక బండిని లాగుతూ 'జూ' పక్కనించి వెళ్ళడం తటస్థించింది- జంతుప్రదర్శనశాలని 'జూ' అంటారట. అక్కడ ఎన్నెన్ని జంతువులో! పక్షులో! క్రూరమృగాలుకూడ వున్నాయక్కడ- వాటి పోషణ భారమంతా ప్రభుత్వానిదేనట- వేళకింత తిండి; మంచి సంరక్షణ. కష్టపడి తనలా పనిచెయ్యనక్కర్లేదు. అయిన

దానికీ కానిదానికీ లాఠీదెబ్బలు తినక్కరలేదు. పోతే.... స్వేచ్ఛ మాత్రం తనకులాగే వాటికీలేదు- అయినా ఏ విధంగా చూసినా అవి తనకంటే ఎన్నో విధాలుగా వున్నతమైన జీవితాన్నే గడుపుతున్నాయనిపించింది.

నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ రోడ్డుమీంచి ఏదో వాహనంపోతోంది. బహుశ రెండో ఆట సినిమా వదిలివుంటారు.

ఇంకెంత? మరికొన్ని గంటలు.... మళ్ళీ తన బండెద్దు జీవితంలో మార్పులేని మరోరోజు మొదలౌతుంది.

రెండురోజుల క్రితం యజమాని కుటుంబం తన బండిమీదే సినీమాకెళ్ళేరు-కళ్ళముందు యిన్ని ప్రాణుల జీవితకథ లుండగా ఆ కల్పిత బొమ్మల జీవితాల్నెందుకు చూస్తారో తెలీదు. తనెప్పుడైనా సినిమా చూస్తేగా అందులో యీ మనుషులు పొందే ఆనందమెంతటిదో తెలియడానికి!

ఊరిబయట వున్న ఆ సినిమాహాలు ముందు తననుంచేసి వాళ్ళు లోపలికి వెళ్ళిపోయారు. వాళ్ళొచ్చే వరకూ తనక్కడే కాపలా. కాసిన్ని గడ్డి పరకలు నములుతూ, తీరుబడిగా నడుం వాల్చిన తనకు అక్కడి హాలు ముందు అంటించి వున్న సినీమా పోస్టర్ కన్పించింది. అందులో ఒక బండికి రెండు మైసూరెడ్లు కట్టబడి వున్నాయి.

వాటి కళ్ళు తన కళ్ళలా వాలిపోయి, నీరుకారుతూ నిస్సారంగా లేవు. కాంతిగా మెరుస్తున్నాయి. ఆనందంతో వుప్పొంగుతున్నట్లున్నాయి.

ఆనందంకాక? మంచిపోషణ. మంచి జీవితం!

దేనికైనా పెట్టి పుట్టాలి!

కళ్ళంట నీళ్ళు తిరిగాయి.

రోడ్డుమీద మనుషులు స్వేచ్ఛగా తిరుగుతున్నారు. మనుష లన్న మాటేమిటి? కుక్కలూ, పిల్లులూ, పక్షులూ.... అన్నీ స్వేచ్ఛగానే సంచరిస్తున్నాయి.

తనకే ఎటువంటి స్వేచ్ఛాలేదు. తన వారిని కల్సుకునే యోగ్యతా లేదు. తాళ్ళ బంధనాలు తప్ప తన బతుక్కి బంధుత్వాలు లేవు.

బరువులు లాగిలాగి యిలా చావాల్సిందే!

*  *  *

కళ్ళు పొడుచుకున్నా కునుకు రావటంలేదు.

శరీరానికీ, మనసుకీ విశ్రాంతి లేదు.

దూరంగా తూరుపుదిశ తెల్లబడుతోంది.

తెల్లవారుతుంది. పొద్దుగుంకుతుంది.

సూర్యుడికీ తనలాగే గానుగెద్దు జీవితం.

ఐతే, సమస్త సృష్టినీ మేల్కొలిపే శక్తి అతనికుంది. చరాచర జీవుల పరిణామ ప్రవర్తనలు ఆయన గతిలోనే కేంద్రీకృతమై వున్నాయి.

అందుకే కాబోలు ఆయనను ప్రత్యక్ష భగవానుడిగా కొలుస్తారు.

ఆలోచనల్లోంచి ఎక్కడో ఓ వెలుగు కిరణం మనసుని తాకింది–మెదడు పదునెక్కి వెలిగింది.

ఒకింత జ్ఞానోదయమైంది.

అవును....తనెందుకు ప్రయత్నించకూడదు?

సృష్టిలో యిన్ని ప్రాణులకున్న స్వేచ్ఛా జీవనం తనకుమాత్రం ఎందుకు లేకుండా పోవాలి?

మానవులకున్నట్లు యీ కుటుంబ వ్యవస్థలూ, సంసారాలూ, సంస్కారాలూ, బంధుత్వాలూ లేకపోతేపోయె. తన జాతి వారితో కనీసం కలిసిమెలిసి తిరిగే అవకాశం తనకెందుకూడదు?

ముందు కాళ్ళతో భూమిని అదిమిపెట్టి లేచి, నాలుగుకాళ్ళమీదా నిలబడింది.

ఇప్పుడా కాళ్ళలో నిస్సత్తువలేదు.

కంఠానికున్న తాడుని బలంగా లాగింది.

అదే బంధనం.

ఆట్టే కష్టంకాకుండానే బంధనం వూడిపోయింది. తనెక్కడికీ పోలేదని తన యజమానికి తనమీద నమ్మకం! ఎంత భరోసా?

ఇక తనెవరికీ బంధీకాదు. బానిసకూడా కాదు.

తనకిక యే యజమానీలేడు!

సృష్టిలో అన్ని జీవుల మాదిరిగా తనూ యిక సంచరిస్తుంది. ఆహారాన్ని సంపాదించుకుంటూ బతుకుతుంది.

అడుగులు ముందుకు పడ్డాయి.

వడిగా....వడివడిగా.

మనసు లేగదూడలా చెంగున ఉరికింది.

అడ్డుగోడలూ, మార్గాలూ అన్నీదాటి, పచ్చికమైదానంలోకి ప్రవేశించింది.

అలసట.

పరుగువల్ల వచ్చిన నిస్సత్తువ.

అక్కడ కూలబడి పోయింది.

చుట్టూ అకుపచ్చని పచ్చిక-ఎదురుగా వాగులోంచి ప్రవహించే స్వచ్ఛమైన నీళ్ళు-

కోటికిరణాలతో తూరుపు కొండమీంచి తొంగి చూస్తున్నాడు కోటానుకోట్ల ప్రాణులకు ప్రాణదాత అయిన సూర్యభగవానుడు.

మగతగా కళ్ళు మూతలుపడ్డాయి.

ఆ ఆనందం, ఆ తన్మయత్వం, ఆ స్వేచ్ఛ ఎంత క్షణికమో ఆ మహిషాత్మ వూహించలేక పోయిందా క్షణంలో.